www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025

5

వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించ వచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం కార్యాచరణ

- -12 నుంచి 14 వరకు ప్రచారం
- - 15న రౌండ్ టేబుల్ సమావేశాలు
- -18న స్కూటర్ ర్యాలీ
- - సదస్సులో సిఐటియు, ఎఐటియుసి నాయకుల వెల్లడి

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

లేబర్ కోడ్స్ రద్దు, కనీసవేతనం రూ.26వేలు, ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం కోసం ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు పిలుపు నిచ్చారు. ఆదివారం సమ్మెను జయప్రదం చేయాలని వైఎస్ఆర్ సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముందుగా యుద్ధంలో మృతి చెందిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అనంతరం సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 సమ్మె చేయాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయని పేర్కొన్నారు. జిల్లాలోని 36 మండలాల్లో ఉన్న కార్మికులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. గతంలో 14 రోజుల ముందు సమ్మె నోటీసు ఇస్తే సరిపోయేదని ఇపుడు నోటీసు ఇచ్చిన తరువాత 60 రోజుల వరకు ఎలాంటి సమ్మె చేయకూడదని తెలిపారు. కార్మిక చట్టాలను ఇలా మార్చేశారని విమర్శించారు. కార్మికులు రక్తం దారపోసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేశారని పేర్కొన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలు చేయడం దుర్మార్గమని చెప్పారు. 2023, డిసెంబరులో కనీస వేతనం రూ.26 ఉండాలని నిర్ణయిస్తే ఇంతవరకు అమలు కాలేదని తెలిపారు. స్కీం వర్కర్లకు కేవలం రూ.11 వేలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 5లక్షల మంది కార్మికులు ఉన్నారని తెలిపారు.

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలు పెరిగాయన్నారు. కారణం మోడీ కార్మిక వ్యతిరేకి అన్నారు. కార్మిక దినోత్సవం మేడే కాదు..విశ్వకర్మ జయంతి జరపాలని బిజెపి చెబుతుందని విమర్శించారు. సమ్మె నోటీసు ఇచ్చి 2,3 నెలలు కావస్తున్న ప్రభుత్వం, కార్మిక శాఖ చర్చలకు పిలిచిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాలు, 450 స్వాతంత్య్ర ఫెడరేషన్‌లు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. రక్షణ వ్యవస్థను ప్రయివేట్ పరం చేస్తే దేశ భద్రతకే ముప్పు అన్నారు.

సిఐటియు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రిటీష్, స్వాతంత్య్ర అనంతరం వచ్చిన కార్మిక చట్టాలను బిజెపి రద్దు చేసిందని తెలిపారు. కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఆర్టినెన్స్ రద్దు చేశారన్నారు. సమ్మె చేయకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెబుతున్నారని పేర్కొన్నారు.

ఎల్‌ఐసి యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ఎల్ఐసి యూనియన్ అనంతపురం, కడప, కర్నూల్ లో విస్తృత సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. మే 20న సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించామన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండాలంటే విభాగాపర వ్యవహారాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమ్మెలో ఎల్ఐసి యూనియన్ భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు.

ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అజీజ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. సమ్మెలో తాము భాగస్వాములు మవుతున్నామని పేర్కొన్నారు.

వామపక్ష రైతుసంఘాల జిల్లా కార్యదర్శులు ఎం.వి.సుబ్బారెడ్డి, బి.దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో రైతులతో ఏదాది పాటు పోరాటాలు చేస్తే తల్గొగ్గిన కేంద్రం వాటిని అమలు చేయడం లేదని తెలిపారు. దాదాపు 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. రైతులకు రూ.20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీ అమలు చేయలేదని విమర్శించారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నరసయ్య మాట్లాడుతూ ఉపాధి పని దినాలు పెంచి కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెలో తాము భాగస్వాములమవుతామని తెలిపారు.

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ మార్చేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. కోడ్స్ మార్పు చేస్తే సంఘాలు ఉండవని చెప్పారు. ప్రశ్నించే హక్కు కోల్పోతామని తెలిపారు. అందుకే సమ్మెలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా మాట్లాడుతూ చట్టాలు తీసివేసి మనస్మృతులు అనే రీతిలో పథకాలు తీసుకురావాలని బిజెపి చూస్తుందని విమర్శించారు. అదాని, అంబానికి వేల కోట్లు మోడీ దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులకు వేతనాలు మాత్రం పెంచడం లేదని తెలిపారు.

యుఇఇయు జిల్లా అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ ఆదాని స్మార్ట్ మీటర్ల ఖరీదు రూ.15వేలు అన్నారు. మొదటి సారి సమస్యవస్తే వాళ్లే మారుస్తారని, తరువ వస్తే రూ.15వేలు ప్రజలు పెట్టుకోవాలని పేర్కొన్నారు. పట్టణాల్లో ఆదాని స్మర్ట్ మీటర్లు వస్తాయని, గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ మీదర్లు ఉంటాయని చెప్పారు. త్వరలో విద్యుత్ రంగం ప్రయివేట్ పరమవుతుందని తెలిపారు. మున్సిపల్, విఆర్ఎ, భవన నిర్మాణ కార్మిక సంఘం, యూనివర్శిటీ, ఆశ సంఘాల నుంచి నాయకులు ప్రసంగించారు. సదస్సులో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు గోపి, ఆనందరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుకు పెద్దపీట

- పండ్లు, కూరగాయల సాగుకు సబ్సిడీ
హార్టికల్చర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఎస్‌వి సుభాషిణి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

ఉద్యాన పంటల సాగుకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేసింది. జిల్లా వ్యాప్తంగా 25 రకాల పండ్లతోటలు సహా కూరగాయలు, పువ్వులతో కూడిన ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఎంఐడిహెచ్, ఆర్‌కెవివై స్కీములతో ఉద్యాన పంటల సాగుకు మెరుగైన ప్రోత్సాహకాలతో ముందుకు సాగుతున్నాం. జిల్లాలో అరటి, మామిడి, చీనీ దిగుబడుల్లో ముందంజలో ఉన్నాం. ఉద్యాన, వాణిజ్య పంటల దిగుబడులకు మంచి ధరలు లభించడం, వాటిని విదేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చడంపై దృష్టి సారించామని పేర్కొంటున్న హార్టి కల్చర్ జిల్లా డిప్యూటీ (ఎఫ్ఎసి) డైరెక్టర్ వి.వి.ఎస్ సుభాషిణితో ముఖా ముఖి...

ఉద్యాన సాగు వివరాలు తెలపండి?

జిల్లాలో 1,58,791 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. దేశీయంగా ఉద్యాన పంటలకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాం. ఇందులో భాగంగా ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. ఇందులో అరటి, మామిడి, చీనీతోటలు, కూరగాయల తోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి.

ఉద్యాన స్కీమ్‌ల గురించి చెప్పండి?

రూ.18.63 కోట్ల ప్రణాళికా వ్యయంతో కూడిన ఎంఐడిహెచ్, ఆర్‌కెవివై స్కీములు అమల్లో ఉన్నాయి. మిషన్ ఇంటెగ్రేటెడ్ డెవలప్‌మెంట్ పథకం కింద 40 నుంచి 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నాం. ఆర్‌కెవివై స్కీమ్ కింద పత్తి సెంటర్లలో 35 శాతం సబ్సిడీ, ఆరెంజ్, కూరగాయల సాగుకు 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నాం.

పండ్లతోటల వివరాలు తెలపండి?

జిల్లాలో 25 రకాల పండ్లతోటలు సాగవుతున్నాయి. పండ్ల తోటలతోపాటు ఎనిమిది రకాల కూరగాయలు, పువ్వుల తోటలు సాగవుతున్నాయి. ఇందులో 10,112 ఎకరాల్లో మామిడి, 20,431 ఎకరాల్లో అరటి, 65,379 ఎకరాల్లో చీనీ, 2,011 ఎకరాల్లో సపోటా, 835 ఎక రాల్లో బొప్పాయి సాగవుతోంది. వీటితోపాటు జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ఉల్లి, టమోటా, చామంతి తదితర పూలతోటలు సాగులో ఉన్నాయి.

హార్టీహబ్ ప్రచారంలో వాస్తవికత ఎంత?

హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామనే ప్రచారంలో వాస్తవికత ఉంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో పండ్లతోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి. పులివెందుల ప్రాంతం నుంచి అరటి ఉత్పత్తులు మధ్యాసియా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పటి వరకు దేశాయ్ కంపెనీ, ఐఎన్ఐ, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీల ఆధ్వర్యంలో ఎగుమతులు జరుగుతున్నాయి.

సబ్సిడీ వివరాలు తెలపండి?

రైపనింగ్ ఛాంబర్స్, శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు సబ్సిడీలు ఇస్తున్నాం. ఎఫ్‌పిఒలకు 75 శాతం కలెక్షన్ సెంటర్లుకు, వ్యక్తిగత కోటా కింద రైతులకు 35 శాతం చొప్పున సబ్సిడీలు అందిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో ఐదు ప్రాంతాల్లో రైపనింగ్ ఛాంబర్స్ ఏర్పాటు చేశాం. దీంతో పాటు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, పండ్ల రసాల పరిశ్రమల స్థాపనలను ప్రోత్సహిస్తున్నాం.

ఫుడ్‌ప్రాసెసింగ్ ఏర్పాటుపై స్పందించండి?

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం అమల్లో భాగంగా 360 యూనిట్ల లక్ష్యాన్ని పెట్టుకున్నాం. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తు న్నాం. 35 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల మేరకు యువతను ప్రోత్సహిస్తోంది.

ఇటీవలి ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటిల్లిన నష్టాలను వివరిం చండి?

2025-26 మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో వరుసగా చోటుచేసుకున్న ప్రకృతి వైపరీత్యాల కారణంగా 3,334 ఎకరాల్లో తోటలు దెబ్బతి న్నాయి. ఇందులో 1784 మంది రైతులకు చెందిన అరటి, తమలపాకు, మునగ, బొప్పాయి, కళింగర, చీనీ, నిమ్మ, మామిడి, కాకర పంటలు దెబ్బతిన్నాయి. ఇందుకుగానూ రూ.4.67 కోట్లతో ప్రతిపాదనలు అందజే యడం జరిగింది.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన నిమ్మ చెట్లు
- 25 ఎకరాల్లో చెట్లు ధ్వంసం
- రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం
- బాధితులకు పరిహారం అందేలా చర్యలు
- ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్య

నేలకొరిగిన నిమ్మచెట్లును పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి

ప్రజాశక్తి- చక్రాయపేట

మండలంలోని చిలేకాంపల్లె పరిధిలో శనివారం రాత్రి వీచిన గాలివానకు నిమ్మ చెట్లు దెబ్బతిన్నాయి. 25 ఎకరాల్లో చెట్లు ధ్వంసమయ్యాయి. సుమారు రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖాధికారి రెడ్డయ్య ప్రాథమిక నివేదికలో తెలియజేశారు. చిలేకాంపల్లె పెద్దూరు గ్రామంలో దేశాయ్ గంగిరెడ్డి, దేశాయ్ రాజారెడ్డి, దేశాయ్ రమణారెడ్డి, దేశీ ఆదినారాయణ రెడ్డి, దేశాయ్ హేమచంద్ర రెడ్డి, సాన బాలాంజనేయులు, గంగులయ్య, జయన్న, మున్నా, ఫక్రుద్దీన్, దస్తగిరి, శ్రీనివాసులతోపాటు దాదాపు 20 మంది రైతులకు చెందిన 25 ఎకరాల్లో నిమ్మచెట్లు వేగంగా వీచిన ఈదుర గాలులకు నేలకొరిగాయి. మేకల వాండ్లపల్లె గ్రామానికి చెందిన లోమడ రామకృష్ణారెడ్డికి చెందిన చీనీ చెట్లు దెబ్బతిన్నాయి. దాదాపు 8 ఏళ్లు నిమ్మ చెట్లు పెంచామని, కాపుకొచ్చి, కోతకు వచ్చిన సమయంలో గాలివానకు వేర్లతో సహా చెట్లు నేలకు ఒరిగిపోవడంతో లబోదిబోమని రైతులు వాపోతున్నారు. విషయము తెలుసుకున్న టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం హుటాహుటినా చిలేకంపల్లి గ్రామంలో నేలకొరిగిన చెట్లను పరిశీలించి ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ముబారక్ గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న చెట్లను పరిశీలించి, నష్టాని అంచనా వేసి నివేదినక ఉద్యానశాఖ ధికారికి పంపినట్లు తెలిపారు. బాధిత రైతులకు పరిహారం అందజేలా చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖాధికారి రెడ్డయ్య పేర్కొన్నారు.

పుట్లంపల్లి అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం తగదు

- పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి శూన్యం
- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

పుట్లంపల్లిలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని 15వ డివిజన్ పరిధిలో ఉన్న పుట్లంపల్లి అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం తగదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పుట్లంపల్లె ప్రాంతంలో సిపిఎం నేతలు పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్లంపల్లె పంచాయతీ కార్పొరేషన్‌లో విలీనం అయితే బాగా అభివృద్ధి చెందుతుందని ఆ ప్రాంత ప్రజలు భావించారన్నారు. ఏళ్లు గడిచినా పన్నుల భారం పెరిగింది తప్ప ఏమాత్రం అభివృద్ధి ఛాయలు కనపడటం లేదన్నారు. కొత్త సౌకర్యాలు, అభివృద్ధి జరగక పోగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను, గ్రామ సచివాలయాన్ని మూసివేశారని విమర్శించారు. కనీసం అంగన్వాడీ కేంద్రం కూడా లేదన్నారు. ఈ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లేకపోవడం వల్ల నీళ్లన్నీ రోడ్ల మీదనే మురుగు ప్రవహిస్తోందని, ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు అనేక రకాల జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. న పుట్లంపల్లికు మూడు ప్రధాన రహదారులు ఉన్నప్పటికీ ఒక్క రహదారి కూడా బాగాలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచౌక్ నుంచి పుట్లంపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆటోలు కూడా ఆ ప్రాంతానికి రావడానికి జంకుతున్నారని పేర్కొన్నారు. రహదారి అభివృద్ధి కోసం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పుట్లంపల్లి పక్కనే ఉన్న చెరువులోకి పశువులు నీటికోసం వెళ్లేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని అనేకసార్లు ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీ ఎలాంటి అమలుకు నోచుకోకుండా ఉందని విమర్శించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వైపు నుంచి పుట్లంపల్లికి వెళ్లే రహదారిని చెరువు కట్టమీద అభివృద్ధి చేసి తారు రోడ్డు వేయాలని, అందుకు అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. పన్నులు కడుతున్న స్థాయిలో పుట్లంపల్లిలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కారం చేయడానికి అధికార యంత్రం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని కలుపుకుని పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి. దస్తగిరి రెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, గోవిందు, నరసింహ ప్రవీణ్ కుమార్, ఓబుల్ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్

చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళపల్లిలోని సెవెంత్ డే అడ్వంటిస్ట్ స్కూల్‌లో ఆదివారం 2001వ సంవత్సరపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎ నిర్వహించారు. స్కూల్, హాస్టల్ ప్రాంత మంతా కలియ తిరుగుతూ తాము ఆడుకున్న అటస్థలంలో చిన్న పిల్లలుగా మారి ఆటలాడుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఎంతో సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన టీచర్లు కేతి సుజాత, ఎం. సుభాషిణిని సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది ఎం.శాంసన్, ప్రెసిడెంట్ జి. ఎలీషా, సెక్రటరీ కె.రాంబాబు, ట్రెసరర్, కె. ప్రకాష్, జాన్, డైరెక్టర్ పాల్గొన్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

అన్నం వడ్డిస్తున్న దాతలు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి- వల్లూరు

లక్ష్మీ నరసింహ స్వామి జయంతి పుం`స్కరించుకొని ముదుగోటి వెంకటసుబ్బయ్య ఆధ్వ ర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని వల్లూరులో అన్న దానం ఏర్పాటు చేశారు. లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, హరిబాబు, పవన్ కుమార్, వెంకటేష్, మునేంద్ర, శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న సుందరీ కరణ పనులను ఆదివారం టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య పరిశీలించారు. అనంతరం ఎఇకి ఫోన్ చేసి విగ్రహానికి అడ్డంగా ఉన్న పెద్ద పెద్ద మొక్కలను పూర్తిగా తొలగించి ప్రజలకు కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఎఇ స్పందిస్తూ మీరు కోరిన విధంగా పనులను చేపడతామని అన్నారు.

నేడు విద్యారంగ సమస్యలపై ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు : పాఠశాలల పునః వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబం ధించిన సమస్యల పరిష్కారమై పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈనెల12 న కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు యుటియఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారమూ విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ప్రధాన సమ స్యలపై మాత్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టిందని, ఉపా ధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా 10 లక్షలమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రయివేట్ పాఠశాలలకు తరలిపోయారని ఆరోపించారు. గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పయనించడం విచారకరమన్నారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 15 న వేలాదిమంది ఉపాధ్యా యులతో విజయవాడలోని విద్యాభవన్ ముట్టడిస్తామని తెలిపారు. ఈ పరిస్థితి తలెత్తకుండా విద్యాశాఖమంత్రి, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

ప్రజాశక్తి-కాశినాయన : మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాశినాయన సబ్ ఇన్‌స్పెక్టర్ యోగేంద్ర తెలిపారు ఆదివారం మండలంలోని ఆలయాల కమిటీ సభ్యులను, పెద్దలను పిలపించి స్టేషన్ పరిధిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలంలో విపరీతంగా దొంగతనాలు జరుగుతున్నాయని, ముందు జాగ్రత్తగా ఆలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరిగేందుకు అవకాశం ఉండదని చెప్పారు. ఒకవేళ దొంగతనం జరిగిన వారిని ఎక్కడ ఉన్నా పట్టుకొని కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా అందరూ కలిసిమెలసి ఐక్యతగా ఉండాలని పేర్కొన్నారు.

డిఎస్‌సిలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆంధ్ర ప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కడపలో మెగా డిఎస్‌సి పరీక్షల కోసం ఆన్ లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వను న్నట్లు బిసి స్టడీ సర్కిల్ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన కడప జిల్లా వాసులకు మాత్రమే బిసి, ఇడబ్ల్యుఎస్, ఇబిసి, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరిలకు చెందిన అభ్యర్థుల నుంచి మెగా డిఎస్‌సి పరీక్షల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. మెగా డిఎస్‌సి ఆన్ లైన్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుదారులు టెట్ పరీక్షలో అర్హత సాధించిన మార్కుల జాబిత, కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న బిసి భవన్ కార్యాల యంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా కార్యాలయంలో కానీ, 9849919221, 9966418572 లేదా dbcweo.ysr. 22@gmail.com ద్వారా సంప్రదించాలని తెలిపారు.

వీరజవాన్‌కు అశ్రునివాళి

ప్రజాశక్తి - బద్వేలు

వీరజవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిందూర్ ఆపరేషన్‌లో భాగంగా జమ్ముకాశ్మీర్ వద్ద భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న దాడుల్లో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీనాయక్ వీర మరణానికి బాధతప్త హృదయాలతో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ ఈనెల 8న రాత్రి పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలం, కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్ (22) వీరోచిత పోరాటం చేసి ఐదుగురి పాకిస్తాన్ ఉగ్రవాదులను హతం చేసి వీరమరణం పొందారని పేర్కొన్నారు ఆయన ప్రాణ త్యాగం వృధా కాదని దేశాన్ని రక్షించడంలో తన ప్రాణాలను త్యాగం చేసిన ధైర్య సైనికుడికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, సగిలి రాయప్ప , పసుపుల మోక్షమ్మ, గంప అనంతమ్మ, నాగ బాబు, పార్టీ కార్యకర్తలు మస్తాన్ బీ,సుబ్బరాయుడు, రామలక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, ఓబయ్య, ఈశ్వరమ్మ, లక్ష్మమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డ

మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న శివానాయక్

దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మూడే మురళీనాయక్ భరతమాత ముద్దుబిడ్డ అని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. వెంకటరమణ, కోశాధికారి డాక్టర్ శివానాయక్ పేర్కొన్నారు. వారు ఆదివారం జవాను స్వగ్రామానికి వెళ్లి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వీర జవానుకు వీడ్కోలు పలికారు. మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ భౌతికంగా దూరమైన దేశం గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. రంగా నాయక్, కడప జిల్లా అధ్యక్షులు రమావత్. జగన్ రాథోడ్ పాల్గొన్నారు.

నేడు బుద్ధ జయంతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బుద్ధ జయంతిని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పిల్లా కుమార్ స్వామి, కార్యదర్శి లెనిన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మల్లెల భాస్కర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుద్ధ జయంతి కార్యక్రమాన్ని పాత రిమ్స్‌లో సోమవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, బసవ తారకం లా కళాశాల అధినేత గోవర్ధన్ రెడ్డి, ఇంటాక్ జాతీయ కౌన్సిల్ సభ్యులు చిన్నపరెడ్డి హాజరవుతున్నట్లుతెలిపారు. కార్యక్రమానికి మానవతావాదులు,సామాజిక కార్యకర్తలు హాజరుకావాలని పేర్కొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా..!

గుంతలతో ఉన్న కడప-పులివెందుల ప్రధాన రహదారి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని కడప-పులివెందుల-రాయచోటికి చెందిన ప్రధాన రహదార్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన రహదారిలో అడుగుకో గుంత ఉండడంతో ఆ రహదారిలో వెళ్లే భారీ, ద్విచక్ర వాహనాలు దెబ్బ తింటున్నాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం పాలనలో వేంపల్లెలో ప్రధాన రోడ్లను 72 అడుగుల మేర విస్తరణకు శ్రీకారం చుట్టింది. కడప-పులివెందుల-గండికి పోయే ప్రధాన రోడ్లు దాదాపు రూ.60.05 కోట్ల వ్యయంతో 4.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల సిమెంటు రోడ్డు, సెంటర్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు నిర్మాణ పనులు ప్రారంభించి పులివెందుల రోడ్డులో కొంతమేర ఒకవైపు సిమెంట్ రోడ్డును నిర్మించారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్థాంతరంగా ఆ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను చేసేందుకు కూటమి నాయకులు ముందుకు రావడం లేదు. కేవలం కూటమి నేతలు ప్రజల అవస్థలను పట్టించుకున్న పాపాన పోలేదు. నిలిచిపోయిన ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెడతారో.. లేదోనని ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రధాన రోడ్లు గుంతలుగా మారడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు భారీ గోతులు తేలి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఆయా ప్రధాన రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు కూడా అధికారులకు, కూటమి నేతలకు కనిపించడం లేదు. ప్రధాన రోడ్లపై గుంతలనే పూడ్చలేని ప్రభుత్వం ఇక గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు ఏమాత్రం నిర్మిస్తుందని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విలాసవంతమైన భవనాలు ఖరీదైన ప్రాంతంగా ఉన్న వేంపల్లె అధ్వాన రహదారులతో అస్తవ్యస్థంగా తయారైందని పలువురు పేర్కొంటున్నారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా రాజీవ్ కాలనీ వరకు, అటు నాలుగు రోడ్ల కూడలి నుండి బైపాస్ వరకు ప్రధాన రహదారులు పూర్తిగా గుంతలుగా మారాయి. రాత్రి సమయంలో ప్రయాణం చేసే వారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో గుంతలు కనపడక వాటిలోని ద్విచక్ర వాహనాలు వెళ్లుతుండడంతో గాయాలవుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన రోడ్డు నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాలు దారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో అడుగడుగునా గుంతలు ఉండడంతో వేంపల్లె వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్లలో నలువైపుల నుంచి మొత్తం బస్సులతో రద్దీగా ఉంటుందని, రహదారులు గోతుల మయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. వాహనాలు దెబ్బ తినడంతోపాటు ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు అంటున్నారు. ఇదే రహదారులపై నిత్యం రాజకీయ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వాహనాల్లో వెళుతుంటారు. వారికి ఈ గుంతలు కనిపించవా? అంటూ వేంపల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దుమ్ము ధూళితో రోగాల పాలవుతున్నాం..

వేంపల్లిలో ప్రధాన రహదారుల నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో దుమ్ము ధూళితో రోగాల పాలవుతున్నాం. అంతేకాకుండా ఈ రోడ్లన్నీ పూర్తిగా గోతుల మయంగా మారింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి గోతులు సైతం వాహనాల రాకపోకలతో పెద్దవి అయ్యాయి. వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు తప్పించే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు ఒకసారి రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలి.

- ఆంజనేయులు, వేంపల్లె

నిర్లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వ పాలనలో మంజూరైన ప్రధాన రహదారి పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం కావాలనే తాత్సారం చేస్తోంది. కొత్త రోడ్లు వేయకపోయినా, గతంలో మంజూరైన ప్రధాన రోడ్లు అయినా వెంటనే పూర్తి చేయాలి. అధికారులు కూడా ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి.

- బాబా ఫక్రుద్దీన్, వేంపల్లె

అధ్వానం.. రాజకోట రోడ్డు

చాపాడు : మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుండి మండల పరిధిలోని రాజకోట గ్రామానికి వెళ్లే తారు రోడ్డు కొంత కాలానికే అధ్వానంగా తయారైంది. ఏటూరు కాలువ వెంబడి ఎన్నో ఏళ్లుగా గ్రావెల్ రోడ్‌పై ప్రయాణం సాగిస్తున్న గ్రామస్తుల అభ్యర్థన మేరకు గత ప్రభుత్వ హయాంలో రోడ్డును ఉపాధి హామీ అనుసంధానంతో తారు రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించకపోవడంతో మూడవ ఏడాది తిరగకుండానే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గ్రావెల్ బయట పడుతోంది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో రోడ్డు నిర్మాణ పనులను సరిగ్గా పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు పరిస్థితి ఈ విధంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు ఏడాది కూడా నిలువలేకపోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మళ్లీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మార్గాన రాజకోటతోపాటు విజయనగరం, ఓబుల్‌రెడ్డిపేట, గాంధీనగరం ప్రజలు మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరుకు రావాల్సి ఉంటుంది. ఎలాంటి వాహనాలు కూడా ఈ మార్గాన ప్రయాణానికి అందుబాటులో ఉండవు. ప్రజలు స్వగ్రామం ఆటోలు, ద్విచక్రవాహనాన్ని ఆశ్రయించాల్సిందే. ఇప్పటికైనా ఈ ప్రాంత గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దెబ్బతిన్న రాజకోట తారు రోడ్డు

గ్రామోత్సవంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

వైభవం.. త్యాగరాజు విగ్రహాల గ్రామోత్సవం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గాండ్ల వీధిలో (ఆర్టీసీ బస్టాండ్ పక్కన) వెలసిన త్యాగరాజ నూతన ఆలయ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా ఊరేగించారు. ఆదివారం ఉదయం గ్రామ పురవీధుల గుండా విగ్రహాలను మేళతాళాలతో నాయీ బ్రాహ్మణులు ఊరేగించారు. సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, గో దర్శనం, జ్వాలా దర్శనం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు స్థానిక ఉర్దూ షాదీఖానా కల్యాణ మండపంలో గొప్ప నాదస్వర కచేరి ఉంటుందని తెలిపారు. నాయి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని త్యాగరాజ స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు సుంకేసులలో ఆంజనేయ స్వామి తిరుణాల

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో వైశాఖమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా మొలకల పౌర్ణమి తిరణాల మహోత్సవం శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం రెండు ఎడ్ల పరుగు పందెం, బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు.

మావిళ్లమ్మ ఆలయంలో బిటెక్ రవి..

చక్రాయపేట : మండలంలోని చిలేకాంపల్లె వద్ద వెలసిన మావిళ్లమ్మ దేవతకు ఆదివారం పులివెందుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రారెడ్డి (బిటెక్ రవి)ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మావిళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తి కావడంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. నారపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలే రామాంజల్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మారెడ్డి రవీంద్రారెడ్డి, మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్రహారం ఉరుసు ప్రారంభం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలోని శ్రీశ్రీశ్రీహజరత్ ఖాజా సయ్యద్ నత్తర్ షావలి రహమతుల్లా అల్లైహి ఉరుసు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఆదివారం నషాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ముస్లింలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు మహోత్సవంలో భాగంగా సోమవారం గంధం కార్యక్రమం ఉంటుందని దర్గా యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి అల్మాస్‌పేటలో ..

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని అల్మాస్‌పేట వద్ద శ్రీశ్రీ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుద్దీన్ హుస్సేనీ చిష్టి ఉరుఫ్ హజరత్ గేసుద రాజ్ బంధాన వాజ్ వారి ఉరుసు మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుస్సేని ఆధ్వర్యంలో గంధం, రాత్రి 10 గంటలకు ఫైసల్ అలీ వార్సి రఫీక్ దిల్దార్ హైదరాబాద్ వారిచే గొప్ప ఖవ్వాలి ఏర్పాటు చేశారు. ఉరుసు 13న, తహలీల్ 14న నిర్వహిస్తారు. గంధ మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

పంటకాలువ పూడిక.. రైతుల్లో ఆందోళన

తిప్పిరెడ్డిపల్లె వద్ద పూడికతో ఉన్న కెసి ఉప కాలువ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్‌పల్లి, పల్లవోలు, చాపాడు, తిప్పిరెడ్డి పల్లె గ్రామాలలో ఉన్న కెసి కెనాల్ ఉప కాలువ పూడికతో నిండిపోయి ఉంది. ఇళ్ల అవసరాల మురుగునీరు కాలువకు అనుసంధానం చేయడం వల్ల కాలువ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి ఉంది. కెసి నీరు కాలువలో ప్రవహించే అవకాశం లేదు. ప్రస్తుతం కెసి కాలువకు మార్చిలో నీరు నిలిచిపోయిన తర్వాత మురుగు తొలగించి కాలువలో పూడికతీత పనులు చేపడితే వచ్చే ఏడాదిలోనైనా సాగు నీరు ప్రవహించే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కెసి కాలువ లైనింగ్ ఏర్పాటు చేసిన కాలువ పూర్తిగా గ్రామం మధ్యలో ఉండడంతో ప్రజలు ఇష్టానుసారంగా డ్రయినేజీ అనుసంధానం చేశారు. పూడికతీత పనులకు ఉపాధి కూలీలు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. కొనేళ్లుగా పూడికతీత పనులు కూడా చేపట్టలేదు. పంచాయతీ సిబ్బంది గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కాలువలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మురుగు కాలువలోకి రాకుండా చూడాలి. అనంతరం పూడికతీత చేపడితే పంట కాలువ ఉపయోగంలోకి వస్తుంది. లేదంటే ఈ పంట కాలువ పూర్తిగా మురుగు కాలువగా మారనుంది.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని రాజీవ్ కాలనీలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. పది రోజులుగా బోరులో భూగర్భ జలాలు అడుగంటి, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. ఇందుకు స్పందించిన సర్పంచ్ ఆర్.శ్రీనివాసులుకు విద్యుత్ మోటర్‌కు మరమ్మతుతోపాటు అదనపు పైపులు బోర్లలో దించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆదివారం పంచాయతీ వాటర్ స్కీం సిబ్బంది శివయ్య దగ్గర ఉండి తాగునీటి బోరులో మోటర్‌కు మరమ్మతులు చేయించి పైపులు దించి ప్రజలకు తాగునీటిని అందించారు. రాజీవ్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ఇబ్బందులు తొలగించిన సర్పంచ్ రాచినేని శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

వేంపల్లి పంచాయతీ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు రాకపోవడంతో సర్పంచ్ ఆర్‌శ్రీనివాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. ఆదివారం బిడాలమిట్ట వీధి, రాజీవ్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి విద్యుత్ మోటర్లు కాలిపోవడంతో ఆ ప్రాంత వాసులకు తాగునీరు అందలేదు. వెంటనే సర్పంచ్ శ్రీనివాసులు స్పందించి తన సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు.

రాజీవ్‌నగర్ కాలనీలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

మాట్లాడుతున్న మహేష్‌బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాలల పున:వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం పట్ల పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టామని, జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించడం లేదన్నారు. ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని తెలిపారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందన్నారు. ఫలితంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలి పోయారని వివరించారు. జిఒ 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరమన్నారు. కొత్తగా 779 హైస్కూళ్ల అప్‌గ్రేడ్ చేయడం, 9,652 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం హర్షణీయమే.. కానీ హైస్కూళ్లల్లో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ సెక్షన్ కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లిషు సర్ ప్లస్ అవుతున్నాయన్నారు. ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 46మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా చేపట్టే ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, రామకేశవ, ప్రకాష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు అమానుషం

ప్రజాశక్తి - కడప

మాజీ మంత్రి విడుదల రజనీపై పోలీసుల తీరు ఉమానుషం అని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు అధ్యక్షులు తెలుగు పులి వెంకట సుబ్బమ్మ అన్నారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిసి కులానికి చెందిన మహిళా నాయకులు విడుదల రజనీపై పోలీసుల వ్యవహారం దారుణం అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయి అన్నారు .మహిళలకు విలువ లేకుండా పోలీసులు ప్రవర్తిస్తుంది అని ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో మహిళా ఎంపిటిసిని అక్రమంగా అరెస్ట్ చేశారని చెప్పారు. ప్రభుత్వ తీరు మారకుంటే మహిళలు తగిన గుణపాఠం చెబుతారు అని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి మహిళా నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి - కడప : తల్లిదండ్రులను ప్రేమించడం పిల్లలకు నేర్పించాలని పాస్టర్ పి. మహేష్ అన్నారు. కడప నగరం 48వ డివిజన్ కృపా కాలనీలో ఆదివారం న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో మదర్స్‌డేను పురస్కరించుకొని స్వీట్లు పంచుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా డేవిడ్ థియొఫిలాస్ హాజరై మాట్లాడుతూ పిల్లలను ఆధ్యాత్మికంగా పెంపొందించడంలో తల్లి బాధ్యత ప్రముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, ఏ.అగస్టిన్, రోజా, లీలావతి, దూపం మహేష్, రమణమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

జవాన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న భూపేష్‌రెడ్డి

వీరజవాన్ భౌతిక కాయనికి నివాళులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశ సరిహద్దుల్లో ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన వీరజవాన్ మురళినాయక్ భౌతికకాయానికి ఆయన స్వగ్రామం అనంతపురం జిల్లా గోరంట్ల మండలం కల్లెతండా గ్రామంలో జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవాన్ మృతి దేశానికి, ఆయన కుటుంబానికి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో డాక్టర్ చదిపిరాళ్ల రాజేష్‌రెడ్డి, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద పిల్లలకు ఉచిత వసతి గృహం

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుపేద కుటుంబాల పిల్లలకు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో చైతన్య చిల్డ్రన్ హోమ్ (బాలుర వసతి గృహం)లో పిల్లలకు ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లు చైతన్న మహిళా మండలి సభ్యులు తెలిపారు. 4వ తరగతి నుండి 7వ తరగతి వరకు చదువుతున్న.. తల్లిగానీ తండ్రిగానీ లేని బాలలు, నిరుపేద కుటుంబాల బాలురులకు వసతి గృహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో చేరే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతోపాటు ప్రతిరోజు అల్పాహారం కూడా ఉంటుందన్నారు. సాయంత్రం ఒక గంటపాటు స్పోర్ట్స్ అండ్ గేమ్స్, మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. స్నానాలకు వేడి నీటి సౌకర్యం, జిలకర మసూర బియ్యంతో రుచి కరమైన భోజనం పెడతామన్నారు. అర్హతగల ఉపాధ్యాయులతో ఉదయం, సాయంత్రం విద్యా బోధన చేయనున్నట్లు వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ, గ్రంథాలయ సౌకర్యం ఉంటుందన్నారు. చేతిరాత మెలకువలు నేర్పిస్తామన్నారు. పరిసరాలు 24 గంటలు సీసీ కెమెరా నిఘాలో ఉంటాయన్నారు. వినోదాన్ని కలిగించేందుకు టీవీ ఎల్సిడి ప్రొజెక్టర్ కలదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వసతి గృహంలో చేరే విద్యార్థులు వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో ఉన్న చైతన్య మహిళా మండలి కార్యాల యంలోని 88867 67141, 80745 08115 నంబర్లను సంప్రదిం చాలన్నారు.

నిబంధనలు పాటించని బిఇడి కళాశాలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బి ఇడి కళాశాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బి ఇడి కళాశాలలు యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. సిబ్బంది, కనీసం ల్యాబ్‌లు కూడా లేవన్నారు. బయటి రాష్ట్రాల నుండి అడ్మిషన్లు నిర్వహించుకుంటూ రూ.వేలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. చాలా వాటికి కనీసం తలుపులు తీసిన దాఖలాలు కూడా లేవన్నారు. యాజమాన్యాలు ఎడ్ సెట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే పరీక్ష నిర్వహణ పూర్తి కాకముందే ఇప్పటినుండే అక్రమంగా అడ్మిషన్లు బయటి రాష్ట్రాల నుండి తెచ్చుకుంటున్నారని తెలిపారు. యూనివర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆయా కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం మదనపల్లి సూర్య డాన్స్ అకాడమీ చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి, మాస్టర్ సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

కడప శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప అర్బన్ : కడప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై వారాంతపు ఆట విడుపులో భాగంగా ఆదివారం మిస్సా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారు శాస్త్రీయ, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. గోదారి గట్టుమీద రామచిలకవే, గొబ్బియాలో గొబ్బియాలు, ఇస్మార్ట్ శంకర్, గళ్ళుగళ్ళు తదితర పాటలకు డాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

గ్యాస్ లీకై విలువైన పరికరాలు దగ్ధం

ఖాజీపేట : మండల పరిధిలోని సర్వర్‌ఖాన్‌పేటలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్రామానికి చెందిన కమలాపురం గౌస్‌పీర్ నివాసంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఫ్రిజ్‌కు అంటుకున్నాయి. ఫ్రిజ్‌తోపాటు ఇంట్లో విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ స్టవ్‌ను ముట్టించే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని కుటుంబ మహిళలు పేర్కొన్నారు. స్థానికులు ఈ విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు సకాలంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

పత్తూరు ఎంపిటిసి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

దొరవారి రాముడు(ఫైల్‌ఫొటో)

పత్తూరుకు చెందిన వైసిపి ఎంపిటిసి సభ్యులు దొరవారి రాముడు (62) ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల వైసిపి నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాముడు మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన వెలుబుచ్చారు. వైసిపి నాయకులు, ఎంపిడిఒ కార్యాలయ అధికారులు, గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. వైసిపి జిల్లా నాయకులు పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ డి.మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు భూమన సుబ్బారెడ్డి, రెడ్యం రామకృష్ణారెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.